
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

ఆదివారం 4 మే 2025





ఉష్ణోగ్రత (అంచనా)

4-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	26
తెనాలి	38	27
నరసరావుపేట	39	26
బాపట్ల	37	28
రెంటచింతల	40	27



నరసరావుపేట మున్సిపల్ బాలుర స్కూల్‌లో అర్ధాంతరంగా నిలిచిన తరగతి గదుల నిర్మాణం

నాడు-నేడు నాస్తుడు

- పాఠశాలల్లో పనులపై నీలినీడలు
- నిలిచిన పనులతో ఏడాదంతా అవస్థలే
- పనుల పూర్తిపై ప్రభుత్వంలో కొరవడిన స్పష్టత
- విద్యా సంవత్సరం ప్రారంభానికైనా పూర్తి చేయాలని వినతి

నిధులు ఇవ్వక.. పనులు సాగక

నాడు-నేడుతో అద్భుతాలు సృష్టిస్తాం. కార్పొరేట్ పాఠశాలల్లో సౌకర్యాలను ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు సమకూరుస్తాం.. అని గత వైసీపీ పాలకులు హడావుడి చేశారు. మొదటి, రెండు విడతలు పేరుతో వేల కోట్లు మంజూరు చేశామని.. వేల పనులు చేపట్టాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అయితే వైసీపీ హయాంలో నిధులు విడుదల కాక.. పనుల సాగలేదు. గత ఏడాది కూటమి ప్రభుత్వం ఆయా పనులు నిలిపేసింది. దీంతో ఏడాదిగా నాడు-నేడు పనులు ముందుకు సాగక అటు విద్యార్థులు, ఇటు ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అనేక పాఠశాలల్లోని తరగతి గదులు నాడు-నేడు సామగ్రితో నిండిపోగా విద్యార్థులకు చెట్ల కింద, వరండాల్లో బోధన చేయాల్సి వచ్చింది. ఏడాది గడిచినా నాడు-నేడు పనులపై ప్రభుత్వంలో స్పష్టత లేకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో పాఠశాలల్లో చేపట్టిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోగా ఆయా పనులపై నీలినీడలు అలుముకున్నాయి. రానున్న విద్యా సంవత్సరం కల్లా తరగతి గదుల పనులు పూర్తి చేసి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాడు నేడు పథకంలో పాఠశాలల రూపురేఖలు మార్చేశాం.. అన్ని వసతులు కల్పించాం అంటూ గత వైసీపీ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. అయితే కూటమి ప్రభుత్వంలో అయినా పనులు సాగుతాయనుకుంటే నిరాశే మిగిలింది. ఏడాదిగా ఏ ఒక్క బడిలోనూ ప్రగతి పని ముందడుగు పడలేదు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని ఏడాదంతా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెండో విడతలో చేపట్టిన పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆశ అడియాసగానే మారింది. అనేక ఆరోపణల నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులను కూటమి ప్రభుత్వం నిలిపేసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండో విడతలో 3,138 పాఠశాలల్లో రూ.699.28 కోట్లతో పనులు చేపట్టారు. ఈ నిధులు మంజూరు చేసినట్లు నాడు వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే నిధుల విడుదలలో చతికిలపడింది. నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు పనులను నిలిపి వేశాయి. నాడు నేడు పనుల పూర్తిపై గత ప్రభుత్వం, ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. నాడు-నేడు పేరుతో అనేక పాఠశాలల్లో ఉన్న తరగతి గదులను కూల్చివేయడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నా పాలకుల్లో స్పందన లేకుండా పోయింది. నూతన గదులు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడంతో తరగతిగదుల సమస్య నెలకొంది. ఇకమరుగుదొడ్ల నిర్మాణం సాగక ఏడాదిగా విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక పాఠశాలల్లో

(మిగతా 6వ పేజీలో)



ములకలూరులో పూనాదులు దాటని తరగతి గది నిర్మాణం

బీటెక్కే

- ఖాళీగానే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు
- 40 శాతం మంది పట్టభద్రులకు పని లేదు
- కొలువుల కోసం ఉన్నత విద్యావంతుల నిరీక్షణ
- ఉపాధి లేని వారిపై ఇంటింటి సర్వే చేసిన ప్రభుత్వం
- మూడు జిల్లాల పరిధిలో 16,91,432 మంది నిరుద్యోగుల గుర్తింపు
- సాంకేతిక విద్యార్థుల్లో 80 శాతం మందికి ఉపాధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళిక



శిక్షణ.. ప్రైవేటు సెక్టార్‌తో అనుసంధానం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బీటెక్ చేసినా ఖాళీగానే ఉంటున్నారు. పేరుకు బీటెక్ చదివినా తగిన ఉద్యోగం లేక ఇంటి పట్టున లేదంటే ఏదో ఒక కోర్సు అభ్యసిస్తూ అనేక మంది ఉంటున్నారు. పీజీతో పాటు పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులు చదివిన వారు కూడా అర్హతకు తగిన కొలువు దొరక్క అల్లాడుతున్నారు. ఇక పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఖాళీగా ఉన్నవారు ఎందరో ఉన్నారు. ప్రభుత్వం ఏదైనా పని చూపితే చేసుకుంటామని ఎదురు చూస్తున్న వారిలో ఎలాంటి విద్యార్హతలు లేని వారు లక్షల్లో ఉన్నారు. లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ మొదలు పెట్టింది. ఉపాధి కల్పనలో భాగంగా ఇప్పటికే సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటింటి సర్వే చేపట్టి చేయడానికి ఎటువంటి పనిలేకుండా ఖాళీగా ఉన్న వారి వివరాలను సేకరించింది. విద్యార్హతలు, గతంలో ఏమన్నా పని చేసి మానేశారా.. అనే అంశంతో పాటు ఏ రంగంలో శిక్షణ తీసుకుని రాణిస్తారు.. తదితర అంశాలపై సచివాలయాల సిబ్బంది ద్వారా ప్రభుత్వం డాటా సేకరించింది. ప్రభుత్వం ఉపాధి చూపెడితే ఇంటి వద్ద నుంచే పనిచేయడానికి ఎంతమందికి ఆసక్తి ఉంది అని అంశంపై కూడా ఆరా తీసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 18 నుంచి 50 ఏళ్ల వయసు వారు ప్రామాణికంగా సచివాలయ ఉద్యోగుల చేత ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహించింది. మూడు జిల్లాల పరిధిలో 16,91,432 గుర్తించింది. వీరంతా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని, తోడ్పాటు కోసమే ఎదురుచూస్తున్నారని నివేదికలో సిబ్బంది పొందుపరిచారు. బాపట్ల జిల్లాలో 5,17,823 మందిని ఉపాధిలేని వారిని గుర్తించగా, గుంటూరు జిల్లాలో ఇది 5,86,100గా ఉంది. ఇక పల్నాడు జిల్లాకు వచ్చేసరికి అత్యధికంగా 5,87,609 మంది చేయడానికి పని దొరక్క ఖాళీగా ఉండడమో లేక వారి విద్యార్హతలకు తగిన కొలువు దొరక్క ప్రయత్నాల్లోనో ఉన్నట్లు సర్వేలో తేల్చారు. ఖాళీగా ఉన్నవారిలో దాదాపు 40 శాతం మంది పట్టభద్రులే కాగా ఇందులో కూడా బీటెక్ వంటి సాంకేతిక కోర్సులు చేసిన వారే అధికంగా ఉన్నారు. పీజీతో పాటు పీహెచ్‌డీ వంటి ఉన్నత చదువులు చదివిన వారు 15 శాతం మంది ఖాళీగా ఉంటుండగా, గత ప్రభుత్వం ఐదేళ్లలో చేస్తున్న కొలువు కోల్పోయిన వారు 15 శాతం మంది ఉన్నట్లు సర్వేలో తేలింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ వరకు చదువుకుని ఖాళీగా ఉన్నవారు, ఎలాంటి విద్యార్హతలు లేకుండా ప్రభుత్వం ఏదన్నా పని చూపిస్తే చేసుకుంటామన్న వారిలో మహిళలే అధికంగా ఉండగా మొత్తం నిరుద్యోగుల్లో వీరిది 30 శాతంగా ఉండడం గమనార్హం. సర్వేలో ఉపాధిలేని వారిగా గుర్తించిన వారిలో 80 శాతం మందికి మూడునెలల వ్యవధిలోనే కొలువు చూపెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులేస్తోంది.

సర్వేలో భాగంగా వివిధ విభాగాల మీద ఆసక్తి ఉండి ఆర్థిక స్థోమత కారణంగా వాటిని నేర్చుకోలేకపోయామని పలువురు వెల్లడించారు. తొలుత వారందరికీ ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇచ్చే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోనుంది. దీనికి సమాంతరంగా విద్యార్హతలను బట్టి ప్రైవేటు కంపెనీలకు ఉద్యోగార్థులకు అనుసంధానకర్తగా ప్రభుత్వం ఉంటూ వారిని ఉపాధి వైపు నడిపించే కార్యక్రమానికి కసరత్తు మొదలుపెట్టింది. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు ఇళ్ల వద్దే ఉపాధి కల్పించే మార్గాల అన్వేషణలో యంత్రాంగం ఉంది. ఇంటి వద్దే తయారు చేసే గృహోపకరణాలు, పచ్చళ్లు, తినుబండారాలు, ఆర్గానిక్ ఉత్పత్తులపై అవగాహన వంటివన్నీ మహిళల ఉపాధి కల్పనలో భాగం చేయడానికి ప్రభుత్వం సదరు విభాగాలను సమాయత్తం చేసింది.

సచివాలయాల్లో ఆన్‌లైన్ పరీక్షలు..

సర్వేలో భాగంగా పని లేకుండా ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ పట్టభద్రులపైన ప్రభుత్వం తొలుత దృష్టి పెట్టింది. తొలుత జిల్లాకు 1000 మంది బీటెక్ గ్రాడ్యుయేట్లకు కొలువులు చూపెట్టే దిశగా కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే ప్రభుత్వం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తోంది. ఆన్‌లైన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా వారికి కొలువులు కల్పించే పనిని సదరు కంపెనీలు చేపట్టేలా ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని త్వరలో జిల్లాలోని ఓ వేదికలో మెగా ఆన్‌లైన్ పరీక్షలను చేపట్టి ఒకేసారి వేల మందికి ఉపాధి చూపెట్టేలా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది. ఈ క్రమంలో ఆయా కంపెనీలకు తగ్గట్టుగా నిరుద్యోగుల్లో నైపుణ్యాలు లేకపోతే వారే అందుకు సంబంధించిన శిక్షణ ఇచ్చేటట్లు కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.



వేటపాలెం : కొత్తపేట సచివాలయంలో ఆన్‌లైన్ పరీక్షకు హాజరైన బీటెక్ గ్రాడ్యుయేట్ (పాత చిత్రం)

రూ.కోట్లతో జీజీహెచ్‌లో సౌకర్యాలు

- రూ.86 కోట్ల ఎంసీహెచ్ బ్లాక్ ఈ ఏడాది చివరికి పూర్తి
- స్టెప్‌డౌన్ ఐసీయూ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు మెడికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జీజీహెచ్‌లో పదినెలల కూటమి ప్రభుత్వం హయాంలో రూ.కోట్లాది వైద్య పరికరాలు సమకూరాయని, సీటీ స్కాన్లు, లిఫ్టులు మరమ్మతులు చేయించామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అత్యవసర వైద్య విభాగానికి అనుబంధంగా 15 పడకలతో నూతనంగా నిర్మించిన స్టెప్‌డౌన్ ఐసీయూను మంత్రి ప్రారంభించారు. ప్రభుత్వాస్పత్రి కోసం నూతనంగా రూపొందించిన లోగోను మంత్రి ఆవిష్కరించారు. జీఎంసీ 80వ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రామారావు, శారద ఇంకుడుగుంతల నిర్మాణానికి రూ.9 లక్షల విరాళం మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ పారిశ్రామికవేత్త తులసీ రామచంద్ర ప్రభు అందజేసిన రూ.10 కోట్ల విరాళంతో వారంలో పనులు ప్రారంభిస్తామన్నారు. సీఎస్‌ఆర్ కింద వచ్చిన రూ.15 కోట్లతో కూడా మరికొన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఐసీయూకు రూ.1.60 కోట్ల విలువైన నాలుగు పీడియాట్రిక్ వెంటిలేటర్లు, ఆరు మొబైల్ వెంటిలేటర్లను విరాళంగా అందజేసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో పాటు ఏసీలు, పడకలు అందజేసిన దాతలను పెమ్మసాని అభినందించారు. దాతలు, పారిశ్రామికవేత్తలతో పాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నాట్కో వంటి కార్పొరేట్ కంపెనీలు జీజీహెచ్‌ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. జీజీహెచ్‌లో కొత్తగా ప్రారంభించిన స్టెప్‌డౌన్ ఐసీయూతో మరో 15 పడకలు అదనంగా అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. పూర్వ విద్యార్థుల వితరణతో ఆస్పత్రి ఆవరణలో రూ.86 కోట్లతో చేపట్టిన ఎంసీహెచ్ బ్లాక్ పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తవుతాయని ప్రకటించారు.



ఆసుపత్రి లోగోను ఆవిష్కరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

పది నెలల్లో పెరిగిన విశ్వాసం

సాయం చేసేందుకు పలువురు దాతలు సిద్ధంగా ఉన్నా గత వైసీపీ అసమర్థత చూసి ఎవరూ ముందుకు రాలేదని పెమ్మసాని తెలిపారు. పది నెలల స్వల్ప కాలంలోనే కూటమి ప్రభుత్వంపై విశ్వాసం పెరిగిందని, దీంతో ఎందరో దాతలు ముందుకు వచ్చి గుంటూరు జీజీహెచ్‌లో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. జీజీహెచ్‌లో ఏనాడైనా వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులను చేపట్టిందా అని కేంద్ర మంత్రి నిలదీశారు. పదినెలల కూటమి ప్రభుత్వం హయాంలో రూ.కోట్లాది వైద్య పరికరాలు సమకూరాయని, సీటీ స్కాన్లు, లిఫ్టులు మరమ్మతులు చేయించామని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర, తూర్పు ఎమ్మెల్యే నశీర్ అహ్మద్, జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, భాష్యం రామకృష్ణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యానికి నిప్పు

- అక్రమంగా తరలిస్తుండగా అడ్డుకున్న ఓ వర్గం
- పేటసన్నిగండ్ల గ్రామంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

కారంపూడి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని గ్రామానికి చెందిన టీడీపీ రెండో వర్గం శుక్రవారం అర్ధరాత్రి అడ్డుకుంది. లారీలో తరలిస్తున్న బియ్యానికి నిప్పంటించింది. బియ్యం తరలింపుతో అధికారుల అలసత్వం బయటపడింది. పార్టీలోని రెండు వర్గాల విద్వేష పూరిత వాతావరణం గ్రామంలో కలకలం రేపింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ షాపుల్లో ఉన్న మిగులు బియ్యాన్ని అమ్ముకునేందుకు ఓ వర్గం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో మిగులు బియ్యాన్ని అర్ధరాత్రి పూట లారీల్లో తరలిస్తు అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్ని ఫిర్యాదులు చేసినా విజిలెన్స్ అధికారులు మండలం వైపు కన్నెత్తి చూడడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీలోని రెండో వర్గం ఈ అక్రమ రేషన్ బియ్యం తరలింపును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తుంది. ఎన్ని పర్యాయాలు చెప్పినా అక్రమదారులు ఈ వ్యాపారాన్ని ఆపకపోవడంతో శుక్రవారం అర్ధరాత్రి ప్రత్యక్ష కార్యాచరణకు దిగారు. లారీలో తరలిస్తున్న బియ్యాన్ని అడ్డుకుని బియ్యం బస్తాలకు నిప్పంటించారు. లారీ అద్దాలను పగలకొట్టారు. నిప్పు అంటుకున్న బస్తాలను లారీ డ్రైవర్ రోడ్డు మీదకు పడేసి పారిపోయేందుకు యత్నించగా మరో వర్గం సభ్యులు అడ్డకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. గ్రామానికి చెందిన వారు ఈ ఘర్షణ మొత్తాన్ని సెల్‌ఫోన్లో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో అప్ లోడు చేశారు. పార్టీలోని రెండు వర్గాలు ఘర్షణ చీకటి వ్యాపారం వెలుగు చూసింది. ఇలా మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ బియ్యం వ్యాపారం అడ్డూ అదుపూ లేకుండా సాగుతుందని సమాచారం. ఫిర్యాదుచేసినా అధికారులు తమకేమీ పట్టనట్లు చూస్తున్నారని పార్టీ కార్యకర్తలే విమర్శించడం కొసమెరుపు.



బియ్యం బస్తాలకు నిప్పంటించిన దృశ్యం



కిందపడేసిన బియ్యం బస్తాలు

డీపీవోగా నాగేశ్వరనాయక్

నరసరావుపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో)గా ఎస్వీ నాగేశ్వరనాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబును కలసి బొకే అందజేశారు. డీపీవోగా ఇక్కడ పనిచేస్తున్న భాస్కరరెడ్డి ప్రకాశం జిల్లా మార్కాపురం డీఎల్‌పీవో బదిలీ అయ్యారు.



కలెక్టర్ అరుణ్‌బాబుతో డీపీవో నాయక్

రూ. 69 కోట్ల.. జడ్పీ బడ్జెట్‌కు మోక్షం

రాజసానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీక 6





కలశాలతో ఊరేగింపుగా తరలివస్తున్న మహిళలు, భక్తులు

అభిషేకం చేస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు

1008 కలశాలతో అభిషేకం

ఘనంగా గంగమ్మతల్లి జన్మదిన మహోత్సవాలు

పిడుగురాళ్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లలో శనివారం గంగమ్మతల్లి జన్మదిన తిరునాళ్ల మహోత్సవం ఘనంగా జరిగింది. 1008 బిందెల కలశాల్లో గంగాజలంతో అమ్మవారికి అభిషేకం చేశారు. అంతకముందు స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం నుంచి పురవీధుల్లో వందలమంది మహిళలు కలశాలతో గంగమ్మతల్లి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. గంగా సమేత ఉమామహేశ్వరస్వామి వార్ల శాంతి కల్యాణం ఆదివారం ఉదయం దేవాలయం ఆవరణలో జరుగనున్నదని కమిటీ మేనేజ్‌మెంట్ కొక్కెర కొండలు తెలిపారు. పూజా కార్యక్రమాలతో పాటు మధ్యాహ్నం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. పట్టణానికి చెందిన కందుల శ్రీనివాసరావు గంగమ్మతల్లి గుడి గోపురానికి రూ.9 లక్షలతో ఇత్తడి తొడుగు ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు దంపతులు, కొక్కెర కొండలు, ముప్పాళ్ల సాంబయ్య, జూలకంటి సుబ్రహ్మణ్యం, యేలూరి చంద్రశేఖరరావు, కొత్త రఘురామయ్య, తిరువీధుల వరప్రసాద్, గుదె నరసింహారావు, నీరుమళ్ల శ్రీను, రామిశెట్టి చంద్రశేఖర్, మణికంఠ స్టూడియో రాము, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం మానేశాడని గొడవ.. భర్త ఆత్మహత్య



మృతుడు బిళ్లా నరసింహారావు

రేపల్లె, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగం మానేయడంతో భార్యాభర్తల మధ్య ఏర్పడ్డ గొడవలు.. భర్త ఆత్మహత్యకు దారితీశాయి. ఈ ఘటన రేపల్లె పట్టణం లోని చోటుచే సుకుంది. శనివారం పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామానికి చెందిన బిళ్లా నరసింహారావు(30) భార్య సాయిదేవితో కలిసి రేపల్లె పట్టణంలో 2వ వార్డులో ఎనిమిది నెలలుగా నివాసం ఉంటున్నాడు. స్థానికంగా పీపుల్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా ఉద్యోగం చేస్తున్నా డు. రెండురోజుల కిందట ఉద్యోగం మానివేయడంతో.. విషయం భార్యకు తెలిసి ఇద్దరి మధ్య గొడవలు ఏర్పడ్డాయి. దీంతో మనస్తాపం చెందిన నరసింహారావు శుక్రవారం అర్ధరాత్రి ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయాడు. వీరికి సంతానం లేదు. మృతుడి తండ్రి బిళ్లా కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే నరేంద్ర

రాజసానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీక

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

పొన్నూరు టౌన్, మే, 3 (ఆంధ్రజ్యోతి): రాజసానికి, పౌరుషానికి ఒంగోలు జాతి ఎడ్లు ప్రతీకలని కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవాలయం వద్ద జరుగుతున్న ధూళిపాళ్ల వీరయ్యచౌదరి మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభరాజాల బలప్రదర్శన పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పెమ్మసాని మాట్లాడుతూ ధృడమైన శరీరం, నడకలో రాజసం, పందెంలో పౌరుషం నింపుకున్న ఒంగోలు జాతి ఎడ్ల ప్రదర్శన అద్భుతమన్నారు. ఎడ్ల పందేల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను అభినందించారు. మరో ముఖ్య అతిథి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పాయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన తమ కుటుంబాలు పశు సంపదతో మమేకమై ఉన్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయం మీద ఉన్న మమకారంతో ఒంగోలు జాతి ఎడ్ల పెంపకం కష్టతరమైనప్పటికీ రైతులు వాటిని పోషిస్తున్నారని కొనియాడారు. విశిష్ట అతిథి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు మాట్లాడుతూ ఇలాంటి బలప్రదర్శనల వల్ల ఒంగోలు జాతి ఎడ్ల గొప్పతనాన్ని బతికించే పరిస్థితి ఉందన్నారు. పాడిపరిశ్రమాభివృద్ధి ద్వారా ఒంగోలు జాతిని పరిరక్షించేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నాలుగుపళ్ల విభాగంలో 18 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. యజమానులకు మెమెంటో, బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



బాలకృష్ణ(ఫైల్)

ఫిరంగిపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో అప్పులు పెరిగి, వాటిని తీర్చలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కండ్రిక గ్రామంలో శనివారం జరిగింది. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. గజేంద్ర బాలకృష్ణ (35) ఐదేళ్లుగా ఎనిమిది ఎకరాల్లో పత్తి, మిర్చి పండిస్తున్నారు. ఈ ఏడాది కూడా తన ఎకరం పొలంతో పాటు.. మరో ఏడెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి పండించాడు. భారీగా నష్టం రావడంతో సుమారు రూ.20 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీరే దారి కానరాక ఆరు రోజుల క్రితం గడ్డి మందు తాగి, అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో బాలకృష్ణ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడని బంధువులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు జాహ్నవి, కావ్య, కుమారుడు కార్తికేయ, భార్య విజయలక్ష్మి ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఫిరంగిపురం సీఐ శివరామకృష్ణ తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 3 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 514.00 అడుగులు ఉంది. ఇది 138.56 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్ ఫ్లో 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.


రూ. 69 కోట్ల.. జడ్పీ బడ్జెట్‌కు మోక్షం

● సమావేశంతో పనిలేకుండానే ఆమోదం

గుంటూరు సిటీ, మే 3(ఆంధ్రజ్యోతి): నాటకీయ పరిణామాల మధ్య స్థానికంగా ఆమోదానికి నోచుకోని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ వార్షిక బడ్జెట్‌కు మోక్షం లభించింది. జిల్లా పరిషత్ బడ్జెట్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవానికి బడ్జెట్ ఆమోదం కోసం అని మార్చి 15న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశాన్ని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు బాయ్‌కాట్ చేశారు. చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా టీడీపీలో చేరిన నేపథ్యంలో ఆమెను ఇబ్బంది పెట్టేందుకు బడ్జెట్ సమావేశానికి డుమ్మా కొట్టాలని వైసీపీ ముఖ్య నేతలు వారికి సూచించారు. ఈ నేపథ్యంలో కోరం లేక సమావేశం వాయిదా పడడంతో బడ్జెట్ ఆమోదానికి నోచుకోలేదు. తిరిగి అదే నెల 29న కూడా సమావేశం నిర్వహించాలని భావించినా అనివార్య కారణాల వల్ల వాయిదా వేశారు. దీంతో రూ. 69,10,87,000 వార్షిక బడ్జెట్ ఆమోదం పొందకపోతే ఇబ్బంది పడతామని అధికారులు తలలు పట్టుకున్నారు.

చక్రం తిప్పిన చైర్‌పర్సన్ దంపతులు

బడ్జెట్ ఆమోదం పొందకుండా మోకాళ్లొడ్డిన వైసీపీ ముఖ్య నేతల ఆనందానికి జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా దంపతులు అడ్డుకట్ట వేశారు. బడ్జెట్ ఆమోదానికి స్థానికంగా ఉన్న ఇబ్బందులను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. వారి సూచనలతో బడ్జెట్‌ను వెనువెంటనే ప్రభుత్వానికి పం పారు. చైర్‌పర్సన్ కార్యాలయం సిబ్బంది ఒకటి రెండు సార్లు కమిషనర్‌ను కలిసి బడ్జెట్ ఆమోదం ప్రక్రియను వేగవంతం చేశారు. ఎట్టకేలకు జిల్లా పరిషత్ బడ్జెట్‌ను ఆమోదింప చేసుకోవడంలో సఫలీకృతులయ్యారు.



మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం



సమావేశంలో ప్రసంగిస్తున్న సీనియర్ న్యాయవాది వైకే

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): శాంతియుత చర్చలకు మావోయిస్టులు సంసిద్ధత వ్యక్తం చేసిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని కమ్యూనిస్టు, విప్లవ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు కోరారు. గుంటూరులోని కొత్తపేటలోని సీపీఐ మల్లయ్య లింగం భవన్‌లో శనివారం నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశం ఈ మేరకు తీర్మానం చేసింది. శాంతియుత చర్చలకు సిద్ధం కాకుండా ఆదివాసీలను చంపుకుంటూ పోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరి ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికే కాక మానవత్వానికి కూడా వ్యతిరేకమన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ దిశగా కృషి చేయాలని కోరారు. వారికి శాంతి కమిటీ త్వరలో కలిసి వినతిపత్రం అందజేయాలని సమావేశం తీర్మానించింది. గుంటూరు జిల్లా స్థాయిలో ఏర్పడిన ఈ కమిటీ రాష్ట్రస్థాయిలో ఏర్పడబోయే కమిటీతో సమన్వయంతో పనిచేయాలని తీర్మానించింది.కోలా నవజ్యోతి, సీనియర్ న్యాయవాది వైకే, సీపీఐ జిల్లా, నగర కార్యదర్శులు జంగాల అజయ్ కుమార్,కోట మాల్యాద్రి పలువురు ప్రజాసంఘాల నాయకులు ఉన్నారు.

కులగణనపై రాజకీయాలు సరికాదు

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటే దేశ వ్యాప్తంగా సమగ్ర కులగణన చేపడతామంటూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయం చేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు హితవుపలికారు. మంగళగిరిలోని



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశ జనాభాలో సగానికి ఉన్న వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీలకు కులగణన చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆనాటి బ్రిటీష ఇండియా.. భారతీయ కుల సమాజంపై స్పష్టమైన అవాహనతోనే పదేళ్లకోసారి జనగణనతో పాటే 1931 వరకు కులగణన కూడా జరిపించారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు భారత పాలకులు మాత్రం జనాభా లెక్కలతోపాటు వివిధ కులాల జనాభా లెక్కలు తీయించలేకపోవడం దురదృష్టకరమని సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, ఉద్యోగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంటీసీ మూర్తి నేతలు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికులకు ఉచితంగా వాటర్ బాటిల్స్

గుంటూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా రైళ్లలో ముఖ్యంగా జనరల్ బోగీల్లో ప్రయాణికులకు రైల్వే శాఖ ఉచితంగా వాటర్ బాటిల్స్ పంపిణీకి శ్రీకారం చుట్టింది. దాతల సహకారంతో మధ్యాహ్నం వేళల్లో గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా అన్ని స్టేషన్లలో ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు మరికొంతమంది ఎన్‌జీవోలు ముందుకొచ్చి ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నారు. అలానే రైల్వే స్టేషన్లలో ప్లాట్ ఫాంలపై కుండలు ఏర్పాటు చేసి, తాగునీటిని అందుబాటులో ఉంచుతున్నారు. శనివారం డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ ఆదేశాల మేరకు రైల్వే డీసీఎం కె.కమలాకర్‌బాబు గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, నంద్యాల తదితర రైల్వేస్టేషన్లలో వాటర్ బాటిల్స్ పంపిణీ చేయించారు. ఎండలు తగ్గేంత వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఆయన చెప్పారు. దాతలు ముందుకొచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు వాటర్ బాటిల్స్ అందజేస్తున్న డీసీఎం కమలాకర్‌బాబు

నాటుసారాపై ఉక్కుపాదం

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

క్రోసూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీదారులు, అమ్మకం దారులు తీరు మార్చుకోక పోతే పీడీ యాక్ట్ ప్రయోగిస్తాని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన సందర్శించి, నేరాలపై సమీక్షించారు. స్టేషన్



క్రోసూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. నాటు సారా నిర్మూలనకు 2.0 కార్యక్రమాన్ని సమసర్థంగా అమలు చేస్తున్నామన్నారు. ఇందుకు మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి.. వారి సహకారంతో నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. నేరస్తు లపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేశామని, అటవీ ప్రాంతాలు, తండాల్లోనూ పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లోని కేసుల వివరాలను పరిశీలించారు. మద్యం షాపులను క్రమం తప్పకుండా తని ఖీ చేయాలని, నిబంధనలు, ఎమ్మార్పీ పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.మణికంఠ, సీఐ తులసీ ఉన్నారు.

నాడు - నేడు.. నాన్చుడు

(5వ పేజీ తరువాయి)

విద్యుత్, తాగునీటి వసతి, పర్నిచర్, మేజర్, మైనర్ మరమ్మతులు, తరగ తి గదులు, ప్రహరీలు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఇంగ్లీషు ల్యాబ్‌లు. భవనాలకు రంగులు తదితర పనులు అరకొరగానే సాగగా పెండింగ్ పనుల ఊసే లేకుండా ఏడాది ముగిసింది. ప్రస్తుతం వేసవి సెలవుల దృష్ట్యా పనులపై ప్రభుత్వం స్పందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

అరకొరగానే పనులు పూర్తి..

- పల్నాడు జిల్లాలో 1298 పాఠశాలల్లో రూ.312 కోట్లు వ్యయ అంచనాతో 8,330 పనులు చేపట్టాలని నిర్ణయించారు. 175 ప్యాకేజీల కింద 759 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 26 ప్యాకేజీల్లో మాత్రమే నిర్మాణాలు జరిగాయి. 547 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణం, ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 352 పాఠశాలల్లో మాత్రమే పూర్తి చేశారు. 91 పాఠశాలలకు ప్రహరీలు నిర్మించాల్సి ఉండగా 29 మాత్రమే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 553 పనులు చేపట్టగా 458 మాత్రమే పూర్తయ్యాయి. 913 మరమ్మతుల పనులకు 284 పూర్తి చేశారు.
- గుంటూరు జిల్లాలో 919 బడుల్లో రూ.203.94 కోట్ల వ్యయ అంచనాతో 6,523 పనులు చేపట్టాలని నిర్ణయించారు. 75 పాఠశాలల్లో 58 ప్యాకేజీల్లో 253 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పది ప్యాకేజీల్లో మాత్రమే పనులు పూర్తి చేశారు. 394 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 237 పాఠశాలల్లో మాత్రమే పూర్తయ్యాయి. 100 పాఠశాలల్లో ప్రహరీలకు 25 బడుల్లో మాత్రమే పూర్తి చేశారు. విద్యుత్ సరఫరా కోసం 397 పనులు చేపట్టగా 264 పూర్తయ్యాయి. మరమ్మతుల పనులు 745 చేపట్టగా 191 పూర్తి చేశారు.
- బాపట్ల జిల్లాలో 944 స్కూల్స్‌లో 183.31 కోట్ల వ్యయ అంచనాతో 6,274 చేపట్టాలని నిర్ణయించారు. 112 స్కూల్స్‌లో 96 ప్యాకేజీల్లో 279 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 16 ప్యాకేజీల్లో మాత్రమే పూర్తి చేశారు. 326 స్కూల్స్‌లో మరుగుదొడ్ల బ్లాక్‌లను నిర్మించడం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 163 చోట్ల పూర్తి చేశారు. 78 పాఠశాలలకు ప్రహరీలు మంజూరు కాగా తొమ్మిది మాత్రమే పూర్తయ్యాయి. విద్యుత్ సరఫరా కోసం 327 పనులు చేపట్టగా 215, మరమ్మతుల పనులు 586 చేపట్టగా 157 మాత్రమే పూర్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు పోలేరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

దాచేపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని మాదినపాడు రోడ్డులో పోలేరమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆదివారం అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ జరుగుతుంది. దాచేపల్లి మాజీ సర్పంచ్ తంగెళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పది రోజులుగా వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉత్సవ విగ్రహాల మూలవిరాట్‌ల ఊరేగింపుతో ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.



ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీచేస్తున్న డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు

రికార్డుల తనిఖీ

సత్తెనపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు శనివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. బెల్టు షాపులు, ఎన్‌డీపీఎల్, గంజాయి వంటి నేరాల నియంత్రణకు సంబంధించిన కేసుల వివరాలను ఎక్సైజ్ సీఐ విజయకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మద్యం షాపులను, బార్ అండ్ రెస్టారెంట్లను ఒక్కొక్కటిగా తనిఖీ చేయాలని సూచించారు. నిబంధనలు పాటించేలా.. ఎంఆర్‌పీ ధరకే మద్యం అమ్మేలా చూడాలన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

● మున్సిపల్ కమిషనర్ వేణుబాబు

మాచర్లటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): మాచర్ల పురపాలక సంఘ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో 29మంది లబ్ధిదారులకు రూ.64.81లక్షల రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. 21నుంచి 50 సంవత్సరాలలోపు వయసుతోపాటు తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం కలిగినవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు ఎమ్మెల్యే యరపతినేని రాక

పిడుగురాళ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పిడుగురాళ్ల, గురజాల మండలాల్లో ఆదివారం జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని పార్టీ శ్రేణులు తెలిపాయి. పిడుగురాళ్ల గంగమ్మతల్లి తిరునాళ్ల, బ్రాహ్మణపల్లిలో దేవాలయ ప్రతిష్ఠ, గురజాల మండలం గంగవరంలో పర్యటిస్తారన్నారు.

పల్నాడు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడిగా దొడ్డా అమరయ్య

అచ్చంపేట, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన దొడ్డా అమరయ్య యాదవ్ పల్నాడు జిల్లా యాదవ సంఘ అధ్యక్షునిగా ఎంపికైనట్లు అమరయ్య తెలిపారు. యాదవ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాసరావు యాదవ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బత్తుల ఉమామహేశ్వర రావు యాదవ్ తనను నియమించినట్లు ఆయన తెలిపారు.

ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలి

అచ్చంపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జీ రవి బాబు శనివారం డిమాండ్ చేశారు. మండలంలోని చెరుకుంపాలెం గ్రామంలో జరుగుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రవి బాబు మాట్లాడుతూ పని దినాలను 150 రోజులకు పెంచాలన్నారు. కూలీలకు మజ్జిగ, మంచినీరు, పలుగు, పార, వేసవి అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. రైతు సంఘం మండల కార్యదర్శి రావిళ్ళ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సత్తెనపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్స్ కంటి క్లినిక్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలకు, కోర్టు సిబ్బందికి వైద్యసిబ్బంది, డాక్టర్లు కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. శిబిరాన్ని న్యాయమూర్తులు కౌషిక్ హుస్సేన్, ప్రియదర్శిని, సుజన్ కుమార్‌లు సందర్శించారు.

నేడు అభయాంజనేయ స్వామి తిరునాళ్ళ

నకరికల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 4వ తేదీ అడ్డరోడ్డు అభయాంజనేయ స్వామి తిరునాళ్ళను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కాళంగి వెంకట నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు.

బాలికల భవితకు కిషోరి వికాసం

సత్తెనపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): బాలికల భవితకు కిషోరి వికాసం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమాన్ని అమలుచేస్తుంది. వేసవి సెలవులను వినియోగించుకొనేలా ప్రభుత్వం కార్యక్రమాలను చేపట్టింది.

జర్నలిస్టులకు శుభాకాంక్షలు

సత్తెనపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): పత్రికా స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. లోకంలో జరిగే ఎన్నో సంఘటనలు నేడు ప్రజల వరకు చేరుకోవటానికి కారణం జర్నలిస్టులు అన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

మాచర్లటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.ఫణిభూషన్ ఆధ్వర్యాన విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, స్టోరీ రీడింగ్, మ్యూజికల్ చైర్స్ గేమ్స్ నిర్వహించారు. పట్టణంలోని జడ్పీ బాలురోన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి



వీర్ల కళ్యాణి (ఫైల్ ఫోటో)

నకరికల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని చల్లగుండ్ల శివారు కోటిరెడ్డి హోటల్ ఎదురుగా శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామానికి చెందిన వీర్ల కళ్యాణి(50) శనివారం కోటిరెడ్డి హోటల్ ముందుగా వారి బంధువుల ఇంటికి వెళ్ళేందుకు రోడ్డు దాటుతోంది. ఆ సమయంలో నకరికల్లు వైపు నుంచి అడ్డరోడ్డు వైపు అద్దంకి-నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై లారీ కళ్యాణిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కళ్యాణి అక్కడికక్కడే మృతి చెందింది. ఆ లారీ రోడ్డు పక్కనే నిల్చొని ఉన్న మరో లారిని ఢీకొట్టింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రోసూరులో నీటి సమస్య జఠిలం

● పూర్తిగా ఎండిపోయిన మైనర్ ఇరిగేషన్ చెరువు

● బావులు, బోర్లలో కనిపించని నీటి జాడ

● ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్న పంచాయతీ అధికారులు



పూర్తిగా ఎండిపోయిన క్రోసూరు చెరువు



నీటి జాడ లేని క్రోసూరులోని ఒక బావి

క్రోసూరు, మే 3(ఆంధ్రజ్యోతి): క్రోసూరులో నీటి సమస్య రోజురోజుకు జఠిలంగా మారుతోంది. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి ప్రజల కనీస అవసరాలకు కూడా నీరులేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. క్రోసూరును ఆనుకొని ఉన్న 300 ఎకరాల మైనర్ ఇరిగేషన్ చెరువు పూర్తిగా ఎండిపోయింది. దీంతో భూగర్భ జలాలు లేక మండల కేంద్రంలోని బావులు, బోర్లు ఎండిపోతున్నాయి. క్రోసూరులో ఉన్న పైలెట్ ప్రాజెక్టు నీటి వనరులు లేక వృథాగా పడివుంది. ప్రాజెక్టుకు అనుబంధంగా నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లోని మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులు వృథాగా ఉన్నాయి. పంచాయతీ అధికారులు ఉదయం, సాయంత్రం పరిమితంగా ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. సుమారు 12వేల జనాభా ఉన్న క్రోసూరులో గతంలో ఎన్నడూ లేనంత నీటి ఎద్దడి నెలకొన్నట్లు స్థానికులు చెపుతున్నారు. ముఖ్యంగా కొండ కింద బజారు, ముదిరాజుల కాలనీ, ముస్లిం కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, విద్యానగర్‌లలో నీటి ఎద్దడి అధికంగా ఉంది. చెరువులో నీరు ఉంటేనే భూగర్భ జలాలు ఉండి బావుల్లో, బోర్లలో నీరు ఉంటుందని, అవి లేకపోవటం వలనే ఈ పరిస్థితి నెలకుందని స్థానికులు చెపుతున్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపడుతున్నాం...

క్రోసూరులో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపడుతున్నామని పంచాయతీ కార్యదర్శి వెంకయ్య అన్నారు. ట్యాంకుల ద్వారా ఉదయం, సాయంత్రం నీటి సరఫరా చేస్తున్నామని, క్రోసూరు చెరువును మంచినీటితో నింపటానికి అధికారులకు నివేదికలు పంపామని తెలిపారు. త్వరలో నీటిసమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



క్రోసూరు ఎస్టీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్

నిరుపయోగంగా ఉన్న పైలెట్ ప్రాజెక్టు

వేలం డబ్బు చెల్లించని పడవల సీజ్



అమరావతి: సీజ్ చేసిన పడవ వద్ద డిప్యూటీ సీఈఓ కృష్ణ, ఇతర అధికారులు



అచ్చంపేట: గింజుపల్లి గ్రామంలో పడవను సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు

అమరావతి, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిడుగు గ్రామం నుండి కృష్ణా జిల్లా ఏటూరు వరకు కృష్ణానదిలో ప్రయాణికులతో పడవ నడుపుకునేందుకు వేలం ద్వారా హక్కు పొందిన పాటదారుడు రెండు నెలలు గడుస్తున్నప్పటికి పాట సొమ్మును చెల్లించకపోగా దాని లైసెన్స్ పొందకుండా నడుపుకుంటున్నందుకు జడ్పీ డిప్యూటీ సీఈవో కృష్ణ శనివారం దిడుగు గ్రామానికి వెళ్లి నదీతీరంలో ఉన్న పడవను సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. పాటదారుడు తొలుత రూ.2.5లక్షల డిపాజిట్ చెల్లించి రూ.50లక్షలకు పాటను దక్కించుకున్నాడు. పాట సొమ్మును చెల్లించకుండా లైసెన్స్ పొందకుండా పడవను నడుపుతున్నట్లు తెలుసుకుని ఎంపీడీవో శివపార్వతి, పంచాయతీ సిబ్బందితో కలసి దిడుగు వెళ్లి పడవను సీజ్ చేసి ఎస్ఐ రాజశేఖర్‌కు ఫిర్యాదు చేసి బోట్‌ను అప్పగించారు.

● అచ్చంపేట, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలో గల గింజుపల్లి గ్రామంలో వేలంలో పడవ పాట కైవసం చేసుకొని సకాలానికి డబ్బు చెల్లించకపోవటంతో శనివారం విజిలెన్స్ అధికారులు దాడి చేసి పడవను సీజ్ చేశారు. గింజుపల్లి నుంచి ఎన్‌టీఆర్ జిల్లా వేదాద్రికి పడవను తిప్పుతుంటారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 2న గుంటూరు జడ్పీలో నిర్వహించిన వేలంలో పాట దక్కించుకున్న అచ్చంపేటకి చెందిన రాయిడి శ్రీనివాసరావు డబ్బు కట్టకుండా పడవను తిప్పుతున్నాడు. దీంతో పడవను సీజ్ చేశారు. విజిలెన్స్ సీఐ పాలేరు శివాజీ, తహసీల్దార్ లక్ష్మీమాధవి, వీఆర్‌వో ఆదిలక్ష్మి, గ్రామ కార్యదర్శి దానియేలు సీజ్ చేసిన వారిలో ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీపీఈవో మణికంఠ

సారా రహిత గ్రామాలకు కృషి చేయాలి

● డీపీఈవో మణికంఠ

మాచర్లటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను వీలైనంత త్వరగా సారా రహిత గ్రామాలుగా చేసేందుకు కృషి చేయాలని డీపీఈవో మణికంఠ సిబ్బందిని ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామ, మండలస్థాయి కమిటీల ద్వారా ఏ కేటగిరిలోని గ్రామాలన్నింటినీ సారా రహిత గ్రామాలుగా ప్రకటించుకోవాలని, దుర్గి, మాచర్ల, వెల్దుర్తి మండలాలను ఈ నెలాఖరు నాటికి సారా రహిత మండలాలుగా ప్రకటించుకునేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ నెలలో కూడా బియ్యం, పంచదారతో సరి

రెంటచింతల, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్‌కార్డుదారులకు కందిపప్పు అందడం లేదు. బియ్యం, అర కిలో పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. పప్పు ధర ఆకాశాన్నంటుతోంది. ఈ పరిస్థితుల్లో చౌక ధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు ఇచ్చే కిలో కంది పప్పు కూడా అందని పరిస్థితి నెలకొంది. గత నాలుగు నెలలుగా కందిపప్పును సరఫరా చేయడం లేదు. ఈ నెలలోనైనా వస్తుందని ఆశపడ్డ పేదలకు నిరాశే ఎదురైంది. కూటమి ప్రభుత్వం బియ్యం, పంచదారతో పాటు కందిపప్పు, గోధుమ పిండి, పామాయిల్ సరఫరా చేయాలని కార్డుదారులు కోరుతున్నారు.

కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

● న్యాయాధికారి శ్రీనివాస కల్యాణ్



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాస కల్యాణ్

మాచర్ల రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీనివాసకల్యాణ్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో మున్సిపల్ కార్మికులకు నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం పలు కార్మిక చట్టాలను వివరించారు. కార్మిక హక్కులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ పాషా, వై కృష్ణమూర్తి గంగుల శ్రీనివాసరావు, అబ్రహం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులపై ప్రభుత్వాల ఉక్కుపాదం

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న నరసింగరావు

మాచర్లటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారి వర్గానికి ప్రభుత్వాలు అనుకూలంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య పెరిగిపోతుందన్నారు. కార్మికుల హక్కులను లేబర్ కోడ్‌ల పేరుతో సవరించి వారి వెన్ను విరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి ముజఫర్, జిల్లా కార్యదర్శి ఎస్ ఆంజనేయులునాయక్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, సురేష్, మల్లేశ్వరి, బండ్ల మహేష్, వెంకటరత్నం, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూళ్లుగా మూడు పాఠశాలల అప్‌గ్రేడ్

● డిప్యూటీ ఈవో ఏసుబాబు

రెంటచింతల, మే 3(ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ చొరవ, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కృషితో మూడు అప్పర్ ప్రైమరీ పాఠశాలలను జడ్పీ హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి విజయ రామరాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు సత్తెనపల్లి డిప్యూటీ ఈవో ఏసుబాబు, ఎంఈవో 2 శివనాగేశ్వరరావు చెప్పారు. వీటితోపాటు మరో 7 పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

మోడల్ స్కూల్‌లో 44 మందికి సీట్ల కేటాయింపు

రెంటచింతల, మే 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జెట్టిపాలెం మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరడానికి ప్రవేశపరీక్ష రాసి మంచి మార్కులు సాధించిన 44మందికి సీట్లు కేటాయించినట్లు ప్రిన్సిపాల్ కె.పాపయ్య చెప్పారు. మెరిట్ లిస్ట్‌ను నోటీసు బోర్డులో ఉంచామన్నారు.జూన్ 12 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

గుండె చెరువు

పురాతన కాలం నుంచి సాగు, తాగు నీటికి ఉపయోగపడుతున్న చెరువులు క్రమంగా తమ ఉనికిని కోల్పోతున్నాయి. పాలకుల చిన్న చూపు, అధికారుల నిర్లక్ష్యం చెరువులకు శాపంగా మారాయి. జలసిరితో కళకళలాడాల్సిన చెరువులు ఒట్టిపోయి దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. మండల పరిధిలోని చెరువుల దుస్థితికి దర్పణం పడుతున్నాయి.

● పూడికతో కునారిల్లుతున్న చెరువులు

● నీరు నిల్వ లేక సాగుకు ఇబ్బందులు

● తగ్గిపోతున్న భూగర్భ జలాలు

● పట్టించుకోని అధికారులు, పాలకులు



ముళ్ల పొదల్లో ధర్మవరం చెరువు

దుర్గి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం చెరువు సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఉన్న ఈ చెరువు నేడు చుక్క నీటి నిల్వకు కూడా నోచుకోవడం లేదు. ముళ్ల పొదలతో నిండి చిట్టడవిని తలపిస్తోంది. వర్షాకాలంలో ఈ చెరువుకు నీరు రావాలంటే కొండ వాగు ఒక్కటే దిక్కు. అయితే ఈ వాగు చాలా ఏళ్ల నుంచి మరమ్మతులకు గురి కావడంతో వర్షపు నీరు దారి మళ్లి బుగ్గవాగు రిజర్వాయర్‌లోకి చేరుతోంది. చెరువు వద్ద వాగు ప్రారంభంలో ఏర్పాటు చేసిన గేటు వాలు తలుపులు నేలమట్టానికి దిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. ఫలితంగా ఈ వాగులో వచ్చే నీరు వెనుకకు మళ్లుతోంది. మండలంలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణం కలిగిన అతి పెద్ద చెరువు ఆత్మకూరులో ఉంది. దశాబ్దాల నుంచి పూడిక పేరుకుపోవడంతో ఆత్మకూరు చెరువు కూడా రైతులకు ఆశించిన స్థాయిలో ప్రయోజనం చేకూర్చలేకపోతోంది. పూడిక సమస్య కారణంగా నీటి నిల్వ సామర్థ్యం కోల్పోయిన ఈ చెరువు నీరు వృథాగా చంద్రవంక వాగులోకి చేరుతోంది. సుమారు 10 అడుగుల మందంతో పూడిక పేరుకుపోయింది. దుర్గి మండల పరిధిలోని ఓబులేశునిపల్లె చెరువుతోపాటు జంగమహేశ్వరపాడు సమీపంలో ఉన్న నెమళ్లగండి చెరువు కూడా ఇలాంటి సమస్యతోనే నిరూపయోగంగా మిగిలిపోయింది. చెరువులు, కుంటలు ద్వారా భూగర్భజల నీటి మట్టం పెరుగుదల ఉంటేనే ఈ చెరువుల పరిధిలోని తాగు, సాగునీటి బోర్లు సక్రమంగా పనిచేస్తాయని తెలిసినా... పాలకులు, అధికారులు మాత్రం చెరువుల మరమ్మతుల విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



మరమ్మతులకు నోచుకోని గేటువాలు




చెరువులపై ఆధారపడిన బోరు

ఆంధ్రుల రాజధాని అమరావతే

● పునర్నిర్మాణ సభ విజయవంతం

● ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, మే 3(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణంతో ఆంధ్రుల కల నెరవేరనున్నదని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో రాబోయే మూడేళ్లలో రాజధాని నిర్మాణాలతో రూపురేఖలు మారిపోనున్నాయన్నారు. వైసీపీ హయాంలో మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాట ఆడి రాజధాని లేని రాష్ట్రంగా ప్రజలు చెప్పుకునే స్థితికి తెచ్చిన జగన్‌కు మతి భ్రమించిందన్నారు. వైసీపీ హయాంలో జగన్ కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా ఉన్నవి కూడా తరిమేయడంతో రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రమైందన్నారు. రాజధాని ప్రాంతంలో ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంతో రౌడీమూక వైసీపీ హయాంలో రాజధాని నిర్మాణ సామాగ్రిని కూడా దొంగిలించుకుపోయిందన్నారు. చంద్రబాబు పిలుపుతో ఎన్నో ఐటి పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు రాష్ట్రానికి తరలిరానున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. రాజధానికి భూములిచ్చిన రైతులపై జగన్ కక్షసాధింపు చర్యలు అన్నీ ఇన్నీ కావని, చివరకు పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించి లాఠీచార్జ్ చేయించడం, శాంతియుత ధర్నాలను భగ్నం చేయడం వంటి చర్యలకు పాల్పడ్డారన్నారు. శుక్రవారం ప్రధాని మోదీ పునర్నిర్మాణ సభకు లక్షలాది మంది తరలివచ్చి విజయవంతం చేయడం చూస్తే రాజధాని అమరావతేనని ప్రజలు మరోసారి విశ్వసించారనేందుకు నిదర్శనమని ఎమ్మెల్యే తెలిపారు.

పల్నాట చిగురిస్తున్న ఆశలు

● శాసనసభ్యుడు బ్రహ్మానందరెడ్డి



మాచర్లటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులు శుక్రవారం ప్రధాని మోదీ ప్రారంభించడంతో ఎగువ పల్నాడు ప్రాంత ఆశలు చిగురిస్తున్నాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ దాదాపు రూ.50వేల కోట్లతో ప్రారంభమయ్యే రాజధాని పనులతో ఎగువ పల్నాడు కూడా సామాజిక, ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో పురోగతి సాధించబోతుందని తెలిపారు. మౌలిక రంగాలు, కనీస అవసరాలకు పెద్దఎత్తున నిధులు కేటాయించేందుకు కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొగ్గు చూపుతున్నారన్నారు. తద్వారా పల్నాడు ప్రాంతం కూడా పారిశ్రామికంగా ప్రగతి సాధిస్తుందన్నారు. ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ హామీనిచ్చారని, త్వరలో మాచర్ల నియోజకవర్గంలో రోడ్లు, తాగు, సాగునీటి ప్రాజెక్ట్ నిర్మాణాలు పరుగులు పెడతాయన్నారు. ఏపీ అభివృద్ధికి అన్నివిధాలా వెన్నుదన్నుగా నిలబడతానని ప్రధాని హామీ ఇవ్వడం పట్ల ఎమ్మెల్యే జూలకంటి హర్షం వ్యక్తం చేశారు.

చేపల వేటకు వెళ్లి.. దారితప్పి

● దంపతులను సురక్షిత ప్రాంతానికి చేర్చిన ఎస్ఐ సమందర్‌వలి



పోలీస్‌స్టేషన్లో దంపతులతో ఎస్ఐ సమందర్‌వలి, సిబ్బంది

వెల్దుర్తి, మే 3(ఆంధ్ర జ్యోతి): చేపల వేటకు వెళ్లి నదిలో దారితప్పిన దంపతులను పోలీసులు రక్షించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన కొడమంచిలి శ్రీను అలియాస్ శ్రీనువెంకట్, అతని భార్య ధనలక్ష్మి చేపలు పట్టే పని కోసం మండలంలోని జెండాపెంట గ్రామానికి గత నెల 19వ తేదీన వచ్చారు. కాగా ఈనెల 2వ తేదీన కృష్ణానదిలో బోటుపై చేపల వేటకు వెళ్లి దారి తప్పారు. కొత్తపుల్లారెడ్డి గూడెం అడవులకు చేరుకొని దారి తెలియకపోవడంతో శనివారం ఉదయం 9 గంటల సమయంలో 100కు డయల్ చేశారు. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా ఆదేశాల మేరకు వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి ఆ దంపతుల ఫోన్ లోకేషన్ తెలుసుకొని సిబ్బంది సాయంతో వారిని వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారు సొంతూరుకు వెళ్లేందుకు, కుటుంబపోషణకు కొంత ఆర్థికసాయం చేశారు.

నీట్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

● ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, మే 3 (ఆంధ్రజ్యోతి): నీట్ నిర్వహణ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలిపారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్ ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షలు ముగిసే వరకు తెరవడానికి వీల్లేదని పేర్కొన్నారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉన్నందున అభ్యర్థులను అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది మినహా ఇతరులను అనుమతించరాదని తెలిపారు. అవసరమైతే కేంద్రాల చుట్టు పక్కల డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఆధార్ క్యాంపులు

వినుకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆధార్ ప్రత్యేక క్యాంపును ఈ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ సర్వీసులకు సంబంధించి నూతన ఆధార్‌కార్డులు ఎన్‌రోల్ చేయుట, బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ అప్‌లోడ్ చేయుట, ఆధార్ డౌన్‌లోడ్, కలర్ ప్రింట్ సర్వీసులను చేస్తామని, పట్టణంలోని ఓబయ్యకాలనీ 9వ సచివాలయం వద్ద క్యాంపు నిర్వహిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అన్నదాన కార్యక్రమం

వినుకొండటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం వారి ఆధ్వర్యంలో శనివారం సంఘం కార్యాలయం వద్ద బాలరమ్య దుర్గ జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 10 సంవత్సరాలుగా సంఘ సభ్యుల సహకారంతో 86వ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, సంఘ ప్రతినిధి భువనగిరి సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో వైవీ సుబ్బయ్యశర్మ, పి.శేషయ్య, ఎంవీ శర్మ, అవ్వారు కోటేశ్వరరావు, నారాయణరావు, దీక్షితులు, దుబ్బల దాసు, శంకరరావు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

రొంపిచర్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల కేరళ మోడల్ పాఠశాల విద్యార్థులు ఇటీవల 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. గత నెల 31వ తేదీన రెడ్డిపాలెం ఏపీ మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్షలు జరిగాయి. పాఠశాలకు చెందిన ముప్పూరి వెంకట త్రిలోక్, నంబుల లహరి అత్యధిక మార్కులు సాధించినట్లు గాలిరెడ్డి శనివారం తెలిపారు. తమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినందుకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ గాలిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామపెద్దలు వారిని అభినందించారు.

చేపల వేటకు వెళ్లి.. దారితప్పి


● దంపతులను సురక్షిత ప్రాంతానికి చేర్చిన ఎస్ఐ సమందర్‌వలి



పోలీస్‌స్టేషన్లో దంపతులతో ఎస్ఐ సమందర్‌వలి, సిబ్బంది

వెల్దుర్తి, మే 3(ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి నదిలో దారితప్పిన దంపతులను పోలీసులు రక్షించారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన కొడమంచిలి శ్రీను అలియాస్ శ్రీనువెంకట్, అతని భార్య ధనలక్ష్మి చేపలు పట్టే పని కోసం మండలంలోని జెండాపెంట గ్రామానికి గత నెల 19వ తేదీన వచ్చారు. కాగా ఈనెల 2వ తేదీన కృష్ణానదిలో బోటుపై చేపల వేటకు వెళ్లి దారి తప్పారు. కొత్తపుల్లారెడ్డి గూడెం అడవులకు చేరుకొని దారి తెలియకపోవడంతో శనివారం ఉదయం 9 గంటల సమయంలో 100కు డయల్ చేశారు. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాషా ఆదేశాల మేరకు వెల్దుర్తి ఎస్ఐ సమందర్ వలి ఆ దంపతుల ఫోన్ లోకేషన్ తెలుసుకొని సిబ్బంది సాయంతో వారిని వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. వారు సొంతూరుకు వెళ్లేందుకు, కుటుంబపోషణకు కొంత ఆర్థికసాయం చేశారు.

కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : న్యాయాధికారి



న్యాయ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాస కల్యాణ్

మాచర్ల రూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): కార్మికులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీనివాసకల్యాణ్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో మున్సిపల్ కార్మికులకు నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం పలు కార్మిక చట్టాలను వివరించారు. కార్మిక హక్కులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు షేక్ పాషా, వై కృష్ణమూర్తి గంగుల శ్రీనివాసరావు, అబ్రహంలింకన్ పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడిగా దొడ్డా అమరయ్య

అచ్చంపేట, మే 3(ఆంధ్రజ్యోతి): కొండూరు గ్రామానికి చెందిన దొడ్డా అమరయ్య యాదవ్ పల్నాడు జిల్లా యాదవసంఘ అధ్యక్షుడిగా ఎంపికైనట్టు అమరయ్య తెలిపారు. యాదవ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాసరావు యాదవ్, తదితరులు తనను నియమించినట్టు ఆయన తెలిపారు.

మిర్చి రైతులు.. దిగాలు

● అనూహ్యంగా పడిపోయిన ధరలు
● నాడు ఎర్రబంగారం సేద్యం..
● నేడు కష్ట నష్టాలకు నెలవు



కోయకుండా వదిలి వేసిన మిరపకాయలు



ఉప్పలపాడులో మిరపకాయలను గ్రేడ్ చేస్తున్న కూలీలు

నూజెండ్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది వరకు మిరప రేట్లు ఆశాజనకంగా ఉండటంతో లాభాలను గడించ వచ్చనే ఆశతో ఈ ఏడాది సాగు చేసిన మిర్చి రైతులకు కష్ట నష్టాలను మిగిల్చింది. వ్యవసాయం అంటేనే భయపడే విధంగా మారింది. మండలంలో ఈ ఏడాది మూడు వేల ఎకరాల్లో మిర్చిని రైతులు సాగు చేశారు. ఎకరాకు ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో లక్ష నుంచి లక్షన్నర వరకు దుక్కులు, మొక్కలు నాటడం, సేద్యం, రసాయానిక పురుగు, తెగులు మందులు, నీటి తడులకు లక్ష నుంచి లక్షన్నర వరకు ఖర్చయింది. కోత కూలీలకు క్వింటాల్‌కు రూ.8వేలు వరకు అదనంగా ఖర్చు అవడంతో మండలంలోని రైతులు తమ పొలాల్లో రెండు, మూడు కోతలను నిలిపి వేశారు. గత ఏడాది ఎకరాకు 20 క్వింటాళ్ళ దిగుబడితో రూ.20వేలకు పైగా రేటు ఉండటంతో లక్ష నుంచి లక్షన్నర వరకు ఆదాయం వచ్చిందన్న నమ్మకంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో మిర్చి సాగు చేశారు. దిగుబడులు తగ్గటం, మిర్చి ధర రూ.7వేలు నుంచి రూ.12వేలు మాత్రమే ఉండటంతో ఎకరాకు రూ.లక్షకు పైగా నష్టం వచ్చిందని, మిర్చి పైరు సాగు చేసిన రైతులందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్చి సాగు చేపట్టే సమయంలోనే మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించటం ద్వారా రైతులు పంటల సాగులో విస్తీర్ణం, పెట్టుబడులను సరి చూసుకొని సాగు చేసుకొనే విధంగా సూచనలు చేయాలని రైతులు వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ తదితర వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులను కోరుతున్నారు.

సాగు చేసేందుకు ధైర్యం చాలటం లేదు

- కే సుబ్బారెడ్డి, మిర్చి రైతు, పాత ఉప్పలపాడు



ఈ ఏడాది మిర్చి సాగు చేసి తీవ్రంగా నష్ట పోవడంతో రానున్న రోజుల్లో మిర్చి సాగు చేయాలంటే ధైర్యం చాలటం లేదు. ఈ ఏడాది తొమ్మిది ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. దిగుబడులు తగ్గటం, రేట్లు లేకపోవటం, కూలీ ఖర్చులు పెరగడంతో పది లక్షల కు పైగా నష్టం వచ్చింది. మిర్చి సాగు చేసిన రైతులందరూ అప్పుల పాలయ్యారు. మిర్చి రైతుల కష్ట నష్టాలను ప్రభుత్వ అధికారులు గుర్తించి రైతులకు న్యాయం చేయాలి.

ధరలు పడిపోవడంతో నష్టం తీవ్రం

- పరిమి శ్రీరాములు, రైతు, కొత్తనాగిరెడ్డిపల్లి



రైతులు సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చే సమయంలో అనూహ్యంగా ధరలు పడిపోవటం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది. ప్రస్తుతం అన్ని రంగాల్లో నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ తదితర టెక్నాలజీతో అద్భుతాలు సాధిస్తున్నారు. కాని వ్యవసాయంలో రైతుల నష్టాలకు పరిష్కారం దిశగా పరిశోధనలు జరగక పోవటం, రానున్న రోజుల్లో రైతులు ఆసక్తి చూపక పోవటానికి కారణంగా మారుతుంది. ఈ ఏడాది మిర్చి సాగులో వచ్చిన నష్టాలు రైతులను కోలుకోలేని విధంగా దెబ్బ తీశాయి. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల్లో మిర్చి సాగు చేసిన రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్‌లు, ఇతర ప్రత్యామ్నాయ ప్రభుత్వ సహకారం లేకపోవటం, మిర్చి సాగుపై రానున్న రోజుల్లో తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది.

అమరావతిలోనే రాజ్‌భవన్

● గవర్నర్‌తో మంత్రి నారాయణ చర్చలు
● ఐకానిక్ భవనాల ఇంటర్నల్ డిజైన్స్‌పైనా..
● నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో మంత్రి సమావేశం



అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష, నార్మన్‌ఫోస్టర్స్, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులతో డిజైన్ల పరిశీలన

విజయవాడ, మే 3 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్(ఏజీసీ) పరిధిలోనే రాజ్‌భవన్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్‌భవన్ డిజైన్ ఎలా ఉండాలన్న దానిపై శనివారం మంత్రి నారాయణ, గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి చర్చించారు. రాజ్‌భవన్ ఎలా ఉండాలి? ఆర్కిటెక్చరల్ డిజైన్ ఎలా ఉంటే బాగుంటుంది? ఇంటీరియర్ స్ట్రక్చర్ ఎలా ఉండాలి? ఎన్ని రూములు ఏర్పాటు చేయాలి? సిబ్బంది ఎంత మంది ఉంటారు? సమావేశాలకు, ఇతర అవసరాలకు అనుగుణంగా ఏమేమి ఏర్పాటు చేయాలి? ఓపెన్ ఏరియా, గార్డెన్ వంటి సదుపాయాలకు సంబంధించి గవర్నర్ నుంచి మంత్రి అభిప్రాయాలు తెలుసుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా కొన్ని సూచనలు చేసినట్లు సమాచారం.

ఐకానిక్ భవనాల ఇంటర్నల్ డిజైన్స్‌పై..

అమరావతి రాజధానిలో తలపెడుతున్న ఐకానిక్ భవనాలైన హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ టవర్ల ఇంటర్నల్ డిజైన్స్ ఎలా ఉండాలన్న దానిపై మంత్రి నారాయణ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో నార్మన్ ఫోస్టర్స్, హఫీజ్ కాంట్రాక్టర్స్, ఎల్‌అండ్ టీ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. హైకోర్టు కాంప్లెక్స్‌లో ఎన్ని గదులు ఉండాలి? ఆర్కిటెక్చర్ ఎలా ఉండాలన్న దానిపై చర్చించారు. ఇంతకు ముందే మంత్రి నారాయణ హైకోర్టు సీజేతో హైకోర్టు కాంప్లెక్స్‌కు సంబంధించి చర్చించారు. హైకోర్టు కాంప్లెక్స్‌లో 52 గదులు కావాలని సీజే సూచించినట్లు సమాచారం. డిజైన్‌ను బట్టి అన్ని గదులు కష్టమని మంత్రి నారాయణ చెప్పగా 48 గదులు ఇచ్చితంగా ఉండాలని సీజే చెప్పారని తెలుస్తోంది. సీజే వ్యక్తపరిచిన విధంగా హైకోర్టు కాంప్లెక్స్‌లో చేపట్టాల్సిన ఇటర్నల్ డిజైన్స్ రూమ్స్‌పై నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. హైకోర్టు కాంప్లెక్స్‌పైన సందర్శకుల కోసం టవర్ ఏర్పాటుపై కూడా చర్చించారు. అసెంబ్లీ భవనంలో అసెంబ్లీ, మండలితో పాటు లోపల ఎన్ని రూములు ఏర్పాటు చేయాలి.. సమావేశ మందిరాలు.. ఆర్కిటెక్చరల్ డిజైన్స్ ఎలా ఉండాలి.. అన్నదానిపై చర్చించారు.

కార్మికులు తమ హక్కులను సద్వినియోగించుకోవాలి

● న్యాయమూర్తి నరేంద్రరెడ్డి

యడ్లపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులు ప్రభుత్వం కల్పించిన చట్టబద్ధమైన హక్కులను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె నరేంద్రరెడ్డి అన్నారు. అంతర్జాతీయ కార్మిక వారోత్సవాల సందర్భంగా శనివారం తిమ్మాపురం పరిధిలోని వసంత ఇండస్ట్రీస్‌లో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై కార్మికులు అవగాహన కలిగి ఉండడం అవసరమని, అప్పుడే పనికి తగ్గ వేతనం పొందగలరన్నారు. బాల కార్మికులను పరిశ్రమల్లో నియమించడం నేరమని, దానికి సంబంధించి ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టాలను తెలియచేస్తూ అవగాహన కల్పించారు. అలాగే కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించి, మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. చట్టపరంగా అందుబాటులో ఉన్న అన్ని సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీహెచ్ ప్రసాద్, న్యాయవాదులు పీ వెంకటేశ్వరరావు, ఏ శివరావు, ఏఎస్ఐ వెంగయ్య, హెచ్ఆర్ఎం పుల్లారావు, శ్రీహరి పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అసంఘటిత రంగ కార్మిక సంక్షేమ పథకాలపై ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ సలోమి అసంఘటిత రంగ కార్మికులకు చట్ట ప్రకారం ఉన్న సౌలభ్యాలు, హక్కులు, ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, మొదటి పట్టణ ఎస్ఐ వంశీకృష్ణ, సహాయ కార్మికశాఖ కమిషనర్ విష్ణు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

వినుకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివయ్య స్థూపం సెంటర్ వద్ద శనివారం ఏఐవైఎఫ్ 66వ ఆర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏరియా కార్యదర్శి డీ మరియబాబు పతాకావిష్కరణ చేసి, మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. ఏఐవైఎఫ్ నాయకులు సలోమి, పద్మ, మస్తాన్, మీరావలి, సుభాని, మల్లికార్జున్, రవి, సాంబయ్య పాల్గొన్నారు.

● చిలకలూరిపేట (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు స్థానిక పార్టీ కార్యాలయంలో ఏఐవైఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సుభాని మాట్లాడుతూ యువతకు ఉద్యోగ ఉపాధి, అవకాశాలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. ఏరియా కార్యదర్శి మల్లికార్జున్, పట్టణ కన్వీనర్ రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులపై ప్రభుత్వాల ఉక్కుపాదం

● సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

మాచర్లటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపుతున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. శనివారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారి వర్గానికి ప్రభుత్వాలు అనుకూలంగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. పర్మినెంట్ ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్య పెరిగిపోతుందన్నారు. కార్మికుల హక్కులను లేబర్ కోడ్‌ల పేరుతో సవరించి వారి వెన్ను విరుస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి ముజఫర్, జిల్లా కార్యదర్శి ఎస్ ఆంజనేయులునాయక్, ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, సురేష్, మల్లేశ్వరి, బండ్ల మహేష్, వెంకటరత్నం, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



గ్రంథాలయంలో రికార్డును తనిఖీ చేస్తున్న కార్యదర్శి సుబ్బరత్నమ్మ

నాదెండ్ల, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారు సుబ్బరత్నమ్మ అన్నారు. నాదెండ్లలో గల గ్రంథాలయాన్ని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వేసవి విజ్ఞాన తరగతులకు హాజరవుతున్న పిల్లలతో మాట్లాడారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే మంచి సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. వేసవికాలంలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఆర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు ఆకస్మిక మృతి



శివ శంకర గుప్తా (ఫైల్‌ఫొటో)

చిలకలూరిపేట, మే3 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు, 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడు, అదే వార్డు రేషన్ డీలర్ అయిన మద్ది శివ శంకర గుప్త(75) శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. ఆయనకు భార్య (మాజీ కౌన్సిలర్ మద్ది కన్యాకుమారి), కుమారుడు, కుమార్తె ఉన్నారు. వార్డులో రేషన్ పంపిణీ పనులు పూర్తి చేసుకుని ద్విచక్రవాహనంపై బయ లుదేరుతున్న సందర్భంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతడు గాయపడడంతో పాటు గుండెపోటుకు గురయ్యాడు. స్థానికులు గమనించి సమీప ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆస్పత్రికి వచ్చి శివశంకర గుప్తా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

విరామ బైబిల్ పాఠశాల తరగతులు



పట్టణంలో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

వినుకొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణపురి కాలనీలో క్రీస్తు బ్లెస్సింగ్ చర్చి ద్వారా రెండు రోజుల నుంచి చిన్నారులకు విరామ బైబిల్ పాఠశాల (వీబీఎస్) తరగతులు శనివారంతో ముగిశాయి. కమల అగస్టీన్ బృందం వారు చిన్నారులకు మూడు రోజులుగా బైబిల్ కథలు, పాటలు, మ్యాజిషో, స్కిట్స్, గేమ్స్ నేర్పించారు. సుమారు 300 మంది చిన్నారులతో పట్టణ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. చిన్న వయసు నుంచే దైవభక్తి నేర్పించడం ద్వారా భావిభారత పౌరులుగా ఎదుగుతారని పాస్టర్ ఫిలిప్ తెలిపారు. చిన్నారులకు మూడు రోజుల పాటు కె.వెస్లీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీబీసీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, వెంకట్ పూలబాల తదితరులు

నరసరావుపేట టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల వ్యాప్తంగా జనవరి 12న నిర్వహించిన 4, 5, 6, 7, 8 తరగతుల మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. స్కూల్ చైర్మన్ పోలీగ్లాట్, బహు భాషా కోవిదుడు వెంకట్ పూలబాల విజేతలకు విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ రూ.5 వేలు అందించామని ప్రిన్సిపాల్ బర్నబాస్ తెలిపారు.

అవమాన భారంతో ముఖం చాటేసిన జగన్

● ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట, మే 3 (ఆంధ్రజ్యోతి): అవమానభారంతో రైతులకు ముఖం చూపించలేక రాజధాని సభకు జగన్ ముఖం చాటేశారని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం పేర్కొన్నారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. వైఎస్ జగన్ గడిచిన ఐదేళ్లలో అధికార గర్వంతో అమరావతిని విధ్వంసం చేసి, విషప్రచారంతో ప్రజా రాజధానిపై దుమ్మెత్తి పోశారని విమర్శించారు. ప్రజలు నమ్మి కట్టబెట్టిన అధికారాన్ని జగన్ తన స్వార్థ, దోపిడీ ప్రయోజనాలకు వినియోగించుకున్నారని ఆరోపించారు. నిత్య కల్యాణంలా జరిగే అమరావతి పనుల్ని, రైతుల కళ్లల్లో ఆనందాన్ని చూస్తూ రాజధానిలో తిరగాలనే వాస్తవాన్ని జగన్ గ్రహించాలని హితవు పలికారు. రాజధాని రైతులకు తన ముఖం చూపించలేక ప్రధాని సభకు సైతం గైర్హాజరయ్యారని అని ప్రత్తిపాటి దుయ్యబట్టారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరవధిక నిరసన

నరసరావుపేట టౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీపార్కు వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరవధిక నిరసన కార్యక్రమం శనివారం ఆరో రోజుకు చేరుకుంది. వైద్య ఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్ కింద కమ్యూనిటి హెల్త్ ఆఫీ సర్ల జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా సీహెచ్‌వోలు మాట్లాడుతూ ఆరు సంవత్సరాలు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెల జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలన్నారు. ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరించే విధంగా హామీ ఇవ్వాలన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం అనుపమ, సాగర్, రాము, మస్తాన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు యూనిఫామ్ పంపిణీ



ఆశాలకు యూనిఫామ్ చీరలు అందజేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బీ రవి

నరసరావుపేట లీగల్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆశా కార్యకర్తలకు శనివారం యూనిఫామ్ చీరలను అందజేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ బీ రవి ముఖ్యఅతిథిగా పాల్గొని చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఆశా కార్యకర్తలు అందరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. జిల్లాను వైద్యసేవలో ఉన్నత స్థాయిలో నిలపడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీ గీతాంజలి, డాక్టర్ పద్మావతి, సురేఖ, సురేష్, డీసీఎం, ఆశాలు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు నిలిపివేశారని వైసీపీ నేతల ఆందోళన



శావల్యాపురం ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైసీపీ నేతలు

శావల్యాపురం, మే 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ వర్గీయులనే వంకతో అర్హతున్న లబ్ధిదారుల సామాజిక పింఛన్లు నిలిపేశారని మండలంలోని పోట్లూరు, పిచికలపాలెం, కొత్తలూరు తదితర గ్రామాల వైసీపీ నేతలు, పింఛనుదారులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. నేలపై కూర్చొని నిరసన తెలిపారు. వైసీపీ మండలాధ్యక్షుడు బొడెపూడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బొందిలిపాలెం, పోట్లూరు గ్రామాల తిరునాళ్లకు వైసీపీ తరఫున కట్టిన ప్రభలకు విరాళాలిచ్చారన్న అక్కసుతో పిచికలపాలెం, పోట్లూరు గ్రామాలకు చెందిన 31 మందికి పింఛన్లు నిలిపేశారని చెప్పారు. అనంతరం ఎంపీడీవో వారితో మాట్లాడుతూ గత నెలలో పోట్లూరు, పిచికలపాలెం గ్రామాల్లో కొందరు అర్హతలు లేకున్నా పింఛన్లు పొందుతున్నారని తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. దర్యాప్తు చేయిస్తున్నామన్నారు. అయితే దివ్యాంగ పింఛన్లను దర్యాప్తు పూర్తికాకుండా ఎందుకు నిలిపేశారని వారు ఎంపీడీవోని ప్రశ్నించగా.. పింఛన్‌లు అందజేస్తామని ఎంపీడీవో సమాధానం ఇచ్చారు. వైసీపీ నేత ముండ్లమూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపుపై వైసీపీ అసత్య ప్రచారాలు

● టీడీపీ మండలాధ్యక్షుడు సాంబశివరావు



శావల్యాపురంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

శావల్యాపురం, మే 3(ఆంధ్రజ్యోతి): పింఛన్లపై వైసీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్నెల్ల క్రితం ప్రభుత్వం చేపట్టిన విచారణలో కొత్తలూరుకు చెందిన ఐదుగురిని అనర్హులుగా గుర్తించి.. పింఛన్లు తొలగిస్తే 30 మందివి తొలగించారని గ్రామంలోని వైసీపీ నేత మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పేదలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగానే ఉంటుందని, పింఛన్లు నిలిపివేయమని స్పష్టం చేశారు. ప్రభుత్వ విచారణలో పింఛన్లు కోల్పోతే తమకు సంబంధం ఏంటని ప్రశ్నించారు. టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గడిపూడి విశ్వనాథం పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మ, పోతురాజు స్వామి తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిలకలూరిపేట, మే 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాటిమీద ప్రాంతంలో ఉన్న అంకమ్మ, పోతురాజు స్వామివార్ల 24వ తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అంకమ్మతల్లిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ వారి ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక పూజల్లో పాల్గొని, అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తిరునాళ్ల వైభవంగా నిర్వహిస్తున్న కమిటీ వారిని ఎమ్మెల్యే సత్కరించారు.